అభిప్రాయ వేదిక: 21-10-49

# ఏది అభ్యుదయ సాహిత్యం?

కొడవటిగంటి కుటుంబరావు

పై శీర్షికతో అక్టోబరు 14 "తెలుగు స్వతంత్ర" లో శ్రీ కొత్తపల్లి రంగారావు గారు ఈ కింది సిద్ధాంతాన్ని ఉపపాదించారు.

"ప్రజల కొక అడుగు ముందుండి, వారి పరిస్థితులనూ సమస్యలనూ అర్థం చేసుకొని, వారికి సరిఅయిన మార్గాన్ని చూపిస్తూ, ఉద్బోధాన్నీ ఉత్తేజాన్నీ కలిగించి కర్తవ్యోన్ముఖుల జేసి, పాత వ్యవస్థలను ధ్వంసంగావించి వాటి శిథిలాలపై నూతన సమాజ నిర్మాణాన్ని గావించడానికి పురికొల్పేదే అభ్యుదయ సాహిత్యం. అదే నిజమైన ప్రజాసాహిత్యం."

అభ్యుదయ సాహిత్యంయొక్క ఆశయాలకు సంబంధించినంతవరకు నేను శ్రీ రంగారావు గారితో ఏకీభవిస్తాను. కాని ఎవరన్నా నన్నుగాని శ్రీ రంగారావుగారినిగాని నిలవేసి, "ఇటువంటి ఆదర్శాలు గలిగిన ఒక గేయంకాని, కథగాని, నాటకంగాని చూపండి," అంటే చూపలేకపోవచ్చు. దానికి కారణం ప్రధానంగా ఏమంటే పైనచెప్పినది అభ్యుదయ సాహిత్యం యొక్క సమష్టి ఆశయం. ప్రతి అభ్యుదయ రచనలోనూ ఇన్ని ఆశయాలూ గూడుకట్టుకుని ఉండాలంటే అభ్యుదయ రచన దాదాపు అసాధ్య మవుతుంది. గోర్కీ రచనలుకూడా పరీక్షకు నిలబడవు.

పై నిర్వచనాన్ని కొంచెం వివరంగా పరిశీలించితే ఏమి తేలేదీ చూద్దాం.

పై సిద్ధాంతానికి అనుగుణంగా రాజకీయాలకు సంబంధించిన రచనలు రచించటం చాలా సులభం. వాటి విషయం నేనిక్కడ ఎత్తుకోను. అచ్చగా సాహిత్యం విషయమే తీసుకుందాం.

అభ్యుదయ సాహిత్యం ప్రజల సమస్యలనూ, పరిస్థితులనూ అర్థం చేసుకోవాలి. ఇదికూడా అభ్యుదయ రచయితలు సులభంగా చేయగల పనే. ప్రజా జీవితానికీ, ప్రజల ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధులకూ అంతరాయంగా ఉన్నది వర్గదోపిడీ విధానమనీ, అది నశిస్తేగాని ప్రజా జీవితం అనవరోధంగా సర్వాంగ శోభితంగా అభివృద్ధి కాదనీ, ప్రజా జీవితం ఒక్క అడుగు ముందుకు వేయకుండా ఉండగలందులకు పై వర్గాలవారు తమ యావచ్ఛక్తులనూ-బుద్ధిబలంతో సహా- ఉపయోగిస్తారనీ అభ్యుదయ వాదులు తప్పక గుర్తిస్తారు.

కాని ఈ విషయాన్ని సాహిత్యంద్వారా ప్రజలకు తెలియపరుస్తూ వారికి "సరియైన మార్గం చూపిస్తూ ఉద్బోధనా ఉత్తేజమూ" కలిగించటం సులభమైన పనికాదు. తుడిచిపెట్టిన పలకమీద ఏదైనా రాయవచ్చు. ప్రజల మనస్సులు తుడిచిన పలకలు కావు. "మీ సమస్య ఇది. ఈపని చేస్తే మీరు పైకి వస్తారు." అని చెప్పినంతమాత్రంచేత ప్రజలు పైకి రాలేరు. వారి వర్గ వాసన పూర్తిగా అర్థంచేసుకోకుండా, వారి జీవితాలలో పాలు పంచుకోకుండా, వారి అజ్ఞానాన్నీ మాఢ్యాన్నీ అవగాహన చేసుకోకుండా, వారి మనస్తత్వాన్ని తూచకుండా వారితో పై విషయాలు అనలేము. ఇందులో మనస్తత్వ పరిజ్ఞానానికీ శిల్పానికికూడా ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ ప్రాముఖ్యాన్ని శ్రీ రంగారావుగారు ఖాతరుచెయ్యక, ఇది సులభమైన పని కాదన్న వారందరూ ఎస్కేపిస్టులనీ, ప్రభుత్వానికి వెరిచిన వారనీ అనేటట్టయితే దాని కెవరు బాధ్యులు?

కేవలం తీర్మానం వున్నంత మాత్రంచేత ఏ మధ్యతరగతివాడు గాని ప్రజాసామాన్యాన్ని యథార్థంగా ఉత్తేజపరిచే రచనలు చేయలేడని నేను నొక్కి వక్కాణించగలను. వర్గసంస్కృతి దానికి అడ్డం వస్తుంది. వర్గసంస్కృతి పుట్టుకతో రాదంటే ఒప్పుకుంటాను గాని అది కృషివల్ల మాత్రమే పోతుందంటే నేను ఒప్పుకోను. వర్గసంస్కృతికి భౌతిక జీవితాధారాలనూ గల

21-10-49

పారస్పర్యాన్ని శ్రీ రంగారావుగారు మరువ రాదు.

పై నిర్వచనలో "పాత వ్యవస్థను ధ్వంసం కావించటం" అనే అంశ మొకటి ఉన్నది. ఇది కూడా అభ్యుదయ సాహిత్యం ఆశయాలలో ఒకటి. సాంఘికాభ్యుదయం చేకూరే పరిణామంలో ఇప్పుడున్న వర్గాల స్వరూపమూ, వాటి సంబంధాలూ కూడా మారతాయని నేను శ్రీ రంగారావుగారికి వేరే చెప్పవలసిన అవసరం ఉండదు. మధ్యతరగతి విశ్వాసాలలోనూ మానసికమైన అలవాట్లలోనూ పరిణామ ఫలితంగా "పుచ్చు" ఏర్పడుతున్నది. ఈ "పుచ్చు"ను ఎత్తిచూపటం, దానిమీద దెబ్బ కొట్టటం అభ్యుదయ లక్షణం ఎందుకు కాదు? అంతమాత్రం చేత అటువంటి రచనలన్నీ ప్రజాసాహిత్య మవుతాయా? అయేపక్షాన నేను రాసిన అనేక కథలు ప్రజాసాహిత్యం అయిఉండాలి. శ్రీ రంగారావుగారు వాటిని ప్రజాసాహిత్యమన్నా నేను అనటానికి సిద్ధంగా లేను. కాని అవి అభ్యుదయ రచనలు మాత్రం అవును.

ఒక మార్క్సిస్టు ఈ విధంగా అన్నాడు:

"వర్గవ్యవస్థ ముదురుతున్న కొద్దీ కళాకారుడికీ ప్రజాసామాన్యానికీ మధ్య ఒక అఖాతం ఏర్పడుతుంది. సామ్యవాద పద్ధతిపై సాంఘిక వ్యవస్థ నిర్మాణమైన మాత్రంచేత కూడా ఈ అఖాతం పోదు. కాని ఇది పోవటానికి సామ్య వ్యవస్థ ఏర్పడటం కనీస షరతు."

శ్రీ రంగారావుగారు చెప్పే మాటకూ ఈ పై సిద్ధాంతానికీ చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది. అనుభవాన్ని బట్టి పై సిద్ధాంతంలో కొంత నిజం ఉన్నట్టుగా కూడా కనిపిస్తున్నది. ఒకనాడు నన్నయభట్టూ, అంతకన్న కూడా తిక్కనసోమయాజీ రాసిన భారతమూ, మరొకనాడు బమ్మెర పోతరాజు రాసిన భాగవతమూ ప్రజాసాహిత్యమైనంతగా ఈనాటి మధ్య తరగతి రచయితలు సృష్టించే సాహిత్యం ప్రజాసాహిత్యం కాలేకుండా ఉంది. మధ్యతరగతికీ శ్రామికులకూ మధ్య ఉన్న ఎడం ఆనాటికీ ఈనాటికీ అనేకరెట్లు పెరిగింది. ఈ భేదం పోవాలంటే కళాకారులు శ్రామికవర్గంయొక్క వర్గ లక్షణాలు పైపైన అలవరచుకొని కృత్రిమ ప్రజా



సాహిత్యం రచించి లాభం లేదు. కళాకారులు తమ వర్గసంబంధా లన్నిటినీ తెంచుకుని శ్రామిక జీవితం అలవరచుకుని, వారి మన స్తత్వం తెచ్చిపెట్టుకుని కళాసృష్టికి పూనుకోవాలి.

లేదా, కళాకారులు తమ వర్గానికే జవాబుదారీ వహించి ఆ వర్గాన్ని అభ్యుదయ పరిణామానికి అనుకూలంగా మార్పు చెందించడానికి సాహిత్యం ద్వారా కృషిచేస్తూ, ఆ వర్గం శ్రామిక వర్గానికి సన్నిహితంగా పరిణామం చెందుతున్న కొద్దీ తాము కూడా శ్రామిక వర్గానికి దగ్గరిగా రావాలి. ఇదే సరి అయిన పద్ధతి అనీ, సాంఘిక విప్లవానికి పూర్వదశలో ఈ పద్ధతికి అర్థం ఉన్నదనీ నా విశ్వాసం.

ఇటువంటిదే విప్లవానంతర దశలోకూడా కనిపిస్తుంది. దీనికి జోష్చెంకో పై చెలరేగిన దుమారంలోనుంచి ఒక ఉదాహరణ ఇస్తాను. జోష్చెంకో సమర్థుడైన రచయితే గాని క్షుద్రమైన మధ్యతరగతి పాత్రలనుగురించి హాస్య ధోరణిలో కథలు రాశాడు. అప్పుడే అంతమైన సామాజిక వ్యవస్థను చిత్రించడానికి ప్రయత్నిస్తున్నాడని కొందరు విశ్వసించారు. కాని ఎంతకూ అతను రష్యా ప్రజాజీవితంలో కలిగే నూతన వికాసాన్ని గురించి రాయలేదు. "ఈ మనిషి గతించిన క్షుద్రజీవితాన్ని గురించి రాయటం లేదు. అతనే స్వయంగా ఆ క్షుద్రమైన మధ్యతరగతి పాత్ర," అని విమర్శకులు తీర్పు చెప్పారు. ఏ దృష్టితో జోష్చెంకో రచనలను కొంతకాలం రష్యాప్రజలు సహించారో, ఎందుచేత జోష్చెంకో కొంతకాలం గొప్ప రచయితగా పరిగణన పొందాడో మనం గ్రహించాలి. నూతన సమాజనిర్మాణానికి తోడ్పడక పూర్వం అభ్యుదయ సాహిత్యం పాత సమాజాన్ని నిర్మూలించటానికి తోడ్పడవలసి ఉంటుంది. ఈ దశలో మధ్యతరగతి నిర్వహించే అభ్యుదయ నిరోధక పాత్రను ఆ తరగతిలోని అభ్యుదయ వాదులు బట్టబయలు చేయవలసి ఉంటుంది.

ఇక ప్రజాసాహిత్యాన్ని తీసుకుంటే, అది అభ్యుదయ సాహిత్యం కాదని నేనన లేదు. దయలెక్టిక్సు తెలిసిన శ్రీ రంగారావుగారు, నేను ప్రజాసాహిత్యమూ అభ్యుదయ సాహిత్యమూ వేరు

వేరని భావించి ఉంటూ ననుకోవలసిన అవసరం లేదు. ప్రజాసామాన్యం తన ప్రత్యేక సాహిత్యాన్ని ఎప్పుడూ సృష్టించుకొంటూనే ఉన్నది. కాని సామాన్యప్రజలు పైవర్గాల సంస్కృతి నుంచి విడివడే కార్యక్రమం చాలా మెల్లిగా జరుగుతున్నది. వర్గవ్యవస్థ ముదిరిన కొద్దీ ఇది మరింత చురుకుగా జరుగుతుంది.

అభ్యుదయ రచయితల సంఘం ప్రోత్సాహంతో ఆంధ్రప్రజానాట్యమండలివారు కొన్ని బుర్రకథలూ, కూచిపూడి భాగవతాలూ, ఇతర ప్రదర్శనాలూ తయారుచేశారు. "ముందడుగు", "మాభూమి" నాటకాలాడారు. ఈ స్వరూపాలన్నీ ప్రజలకు చాలా సన్నిహితంగా వెళ్లి లక్షలాది ప్రజానీకానికి ప్రజాసాహిత్యం చవిచూపినై. అదే "అభ్యుదయ" పత్రికలో వెలువడిన వ్యాసాలూ, కథలూ చూసినట్లయితే అవి ప్రజాసాహిత్యం అనిపించుకో లేదు. అంతమాత్రం చేత అవి అభ్యుదయ సాహిత్యం కాకనూ పోలేదు. నిజమైన ప్రజాసాహిత్యం ప్రజలలో నుంచీ, వారిలో కలిగే చైతన్యంలోనుంచీ ఉత్పత్తి కావలసి ఉన్నది. మధ్యతరగతివాళ్ళు కృత్రిమ ప్రజాసాహిత్యం సృష్టి చేయవచ్చు. కాని దానితో ప్రజలను ఉత్తేజపరచటంమటుకు సులభం కాదు.

21-10-49

# రాజకీయాలు : నైతికప్రమాణాలు

జి. సాంబశివరావు

సెప్టెంబరు 30-వ తేది "తెలుగు స్వతంత్ర"లో "నేటి రాజకీయవాది-నైతిక ప్రమాణాలు" అను శీర్షికతో నొక వ్యాసము ప్రచురించబడినది. అందులో రచయిత నేటి రాజకీయవాదియొక్క నైతిక పతనమునకు, దానివలన ప్రజలకు కలుగుచున్న బాధలకు విచారించిరి. రాజకీయవాదియొక్క మనోవాక్కాయ కర్మలయం దేమాత్రము పరస్పర విరుద్ధము లుండరాదని వాకొనిరి. తుదకు "వాదము లెంత విలువగలవైనను... నైతిక విలువలయొక్కయు, ధర్మవాదము యొక్కయు ప్రాముఖ్యమును గుర్తింపని నో... నేటి రాజకీయ విధానములపై ఆధారపడిన వ్యవస్థలును చీట్లపేక మేడలవలె కూలిపోక తప్పదు!" అని తెగవేసి చెప్పిరి. హృదయపూర్వకముగ మానవ శ్రేయస్సును గోరు ప్రతివారు వీనినే చెప్పుచున్నారు. వారిలో కొందరు స్వీయాచరణముచే ఆరాధ్యు లగుచున్నారు కూడ. కాని నైతిక వాదరీత్యా 'గ్రుడ్డిలో మెల్లవలె కమ్యూనిస్టు...రాజకీయములు కొంతకు కొంత ప్రోత్సాహజనకముగ నున్న" వనుట మిక్కిలి వింతగొల్పుచున్నది. అంతియెగాక వారి వ్యాసములో ఏ నైతికసూత్రములు చెప్పబడినవో వానినే ఖండించినటుల యగుచున్నది. నైతిక వాదరీత్యా కమ్యూనిస్టు రాజకీయములు కాంగ్రెసు మరియు యితర వామపక్షముల రాజకీయములకంటె ఏవిధముగ "గ్రుడ్డిలో మెల్లవలె" నున్నవో తెలుపలేదు. అందువలన వారిదృష్టిలో నైతిక ప్రమాణాలకు ప్రత్యేకార్థ మేమైన యున్నదా? లేక దానియందుండెడి పక్షపాతము వారి నటుల వ్రాయుటకు ప్రోత్సహించినదా?

ప్రపంచములో గ్రుడ్డికంటివారివలన వారికే ఇబ్బందికలుగునుగాని, మెల్లకంటివారివలన యితరులకు యిబ్బంది కలుగుచుండును. కొన్ని సమయములలో వారిమాపులచే పొరబడుటకును లేక వారిచే మోసగింపబడుటకునుకూడ అవకాశమున్నది. అందువలనె గ్రుడ్డికంటివంటి రాజకీయములుగల యితర పక్షములనుండి జాగ్రత్తపడుటకు అవకాశముండి- గ్రుడ్డికన్నుగాని, మంచికన్నుగాని కమ్యూనిస్టురాజకీయములవలన ప్రజలు పొరబడి, మోసగింపబడి, బాధింపబడుచున్నారు.

అసలు అనాదికాలమునుండి రాజకీయశాస్త్రమునకు నైతిక ప్రమాణాలకు సంబంధమెంతకంతగానే యున్నటుల కనుపించుచున్నది. పురాణకాలమునుండి నేటివరకు వచ్చిన ఏ రాజకీయ